సాక్షి సూర్యాపేట

మంగళవారం । 17 । డిసెంబర్ । 2024



ఒప్పందాలను తెలియజేయాలి

అదానీతో జరిగిన ఒప్పందాలను తెలియ జేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం కోరారు. - 8లో



భూ నిర్వాసితుల ధర్నా

రీజినల్ రింగ్‌రోడ్డు బాధితులు సోమవారం చౌటుప్పల్ ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. - 8లో



సైబర్ నేరగాళ్ల టోకరా

క్రెడిట్ కార్డు ఇప్పిస్తామని ఓ ఉద్యోగికి సైబర్ నేరగాళ్లు టోకరా పెట్టారు. అతడి ఖాతా నుంచి రూ.1.50 లక్షలు కాజేశారు. - 8లో

న్యూస్‌రీల్

అనుమతులు రద్దు చేసేవరకు ఉద్యమిస్తాం



నినాదాలు చేస్తున్న అఖిలపక్ష నాయకులు

మోతె : మండలంలో రావిపహడ్ గ్రామంలో నిర్మిస్తున్న ఎస్ఎంకె ఇథనాల్ ఫ్యాక్టరీ అనుమతులు రద్దు చేసేవరకు ఉద్యమిస్తామని అఖిల పక్ష పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు అన్నారు. సోమవారం మోతె మండల పరిధిలో రావిపహడ్ గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట అఖిల పక్షపార్టీల, ప్రజా సంఘాల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇథనాల్ ఫ్యాక్టరీ పనులు పూర్తయితే చుట్టుపక్కల గ్రామాల ప్రజల ఆరోగ్యంపై కాలుష్య ప్రభావం చూపుతుందన్నారు. కంపెనీ నుంచి వెలువడే వ్యర్థాలు పక్కనే ఉన్న పాలేరు రిజర్వాయర్‌లోకి వదిలితే భూగర్భ జలాలు కలుషితమయ్యే అవకాశం ఉందన్నారు. ఈ సందర్భంగా ఇథనాల్ వ్యతిరేక పోరాట కమిటీని ఎన్నుకున్నారు. సీపీఐ(ఎం-ఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మండారి డేవిడ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అఖిల భారత రైతుకూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఒక్కంతుల కోటేశ్వరరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శీలం సైదులు, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మట్టిపెల్లి సైదులు, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఆవుల నాగరాజు, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి గంట నాగయ్య, తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలని ధర్నా



తుంగతుర్తిలో ధర్నా చేస్తున్న మహిళలు

తుంగతుర్తి: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం తుంగతుర్తి మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మహిళలు రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య పాల్గొని మాట్లాడుతూ ఆడపిల్లలకు స్కూటీలు, మహిళలకు రూ.2500, కల్యాణలక్ష్మితోపాటు తులం బంగారం, ఆసరా పెన్షన్ రూ.4000 ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. ఏడాది గడిచినా హామీలు అమలు చేయలేదన్నారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లో ఎన్నికల హామీలను అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గుండగాని కవితరాములుగౌడ్, బీఆర్ఎస్ మండల మహిళా అధ్యక్షురాలు తునికి లక్ష్మి, తాటికొండ సోమలక్ష్మి, మంజుల, విమల, నర్సమ్మ, ప్రేమలత, ముత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి బేస్‌బాల్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

హుజూర్‌నగర్ : క్రీడలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని హుజూర్‌నగర్ మున్సిపల్ వైస్ చైర్మన్ కోతి సంపత్‌రెడ్డి, జిల్లా యువజన క్రీడల అధికారి రామచంద్రరావు అన్నారు. సోమవారం హుజూర్‌నగర్‌లోని క్యాంప్ హైస్కూల్లో సీఎం కప్ జిల్లాస్థాయి బేస్‌బాల్ ఎంపిక పోటీలను సీఐ చరమందరాజు, ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ ఎండీ అజంబాబాతో కలిసి వారు ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో మంత్రి ఉత్తమ్ సహకారంతో అత్యాధునిక హంగులతో త్వరలోనే ఇండోర్ స్టేడియం నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 18, 19, 20, 21 తేదీల్లో హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి సీఎం కప్ బేస్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ పోటీల్లో 30 మంది బాలికలు, 40 మంది బాలురు పాల్గొన్నారు. కార్యక్రమంలో హుజూర్‌నగర్, గరిడేపల్లి ఎంఈఓలు సైదానాయక్, చత్రునాయక్, జీహెచ్ఎం, నోడల్ ఆఫీసర్ బీరెల్లి శ్రీనివాస్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు విశ్వజ్ఞచారి, జనార్దన్‌రెడ్డి, కే.సునీల్‌కుమార్, హుస్సేన్, అంబేడ్కర్, సుభద్ర, క్రీడల కన్వీనర్ షేక్ ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

● ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభం



జిల్లా కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలో పాల్గొన్న మహిళలు



అలంకరణలో శ్రీ వేంకటేశ్వరస్వామి మూలవిరాట్

సరిహద్దు చెక్‌పోస్టులు..

వసూళ్లకు అడ్డాలు!

- చెక్‌పోస్టుల్లో డ్యూటీల కోసం అధికారులు, సిబ్బంది పోటీ
- నిబంధనలకు విరుద్ధంగా నడిచే వాహనాల నుంచి వసూళ్లు
- ప్రైవేట్ వ్యక్తులను పెట్టుకుని దందా సాగిస్తున్న సిబ్బంది
- ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి



ఈనెల 4వ తేదీన వాడపల్లి చెక్ పోస్ట్ వద్ద ఏసీబీ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా లెక్కకు మించిన డబ్బు రూ.86 వేలు దొరికింది. ఆ డబ్బు ఎక్కడిదని ప్రశ్నిస్తే సిబ్బంది నుంచి సరైన సమాధానం లేదు. దీంతో ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకొని, ఇక్కడి పరిస్థితిని.. ఏసీబీ ఉన్నతాధికారులతోపాటు, రవాణా శాఖకు నివేదించారు. చెక్‌పోస్టుల వద్ద జరుగుతున్న అవినీతికి ఇదో ఉదాహరణ.

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : ఉమ్మడి జిల్లాలోని ఆంధ్రా–తెలంగాణ సరిహద్దుల్లో ఉన్న చెక్‌పోస్టులు అవినీతికి అడ్డాగా మారాయి. తెలంగాణ, ఆంధ్రా ప్రాంతానికి సరిహద్దుగా ఉన్న వాడపల్లి, నాగార్జున సాగర్, కోదాడ వద్ద ఉన్న చెక్‌పోస్టుల్లో సిబ్బంది అక్రమ వసూళ్ల దందా సాగిస్తున్నారు. నిబంధనలను ఉల్లంఘించే వాహనాలకు జరిమానా విధించి ఆ మొత్తాన్ని ప్రభుత్వ ఖజానాకు జమ చేయాల్సి ఉండగా.. జరిమానా విధించకుండా అందినకాడికి దండుకొని జేబుల్లో వేసుకుంటున్నారు. ఇలా నిత్యం రూ.లక్షలు చేతులు మారుతున్నా పట్టించుకునే వారు లేకుండాపోయారు. ఈ వ్యవహారంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగానే గండిపడుతోంది.

చెక్‌పోస్టుల వద్ద ప్రైవేటు వ్యక్తుల దందా

చెక్‌పోస్టుల వద్ద డ్యూటీ కోసం రవాణా శాఖ సిబ్బంది పోటీ పడతారన్న చర్చ ఉంది. చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది కొంతమంది ప్రైవేట్ వ్యక్తులను ఏర్పాటు చేసుకొని వారి ఆధ్వర్యంలోనే ఈ వసూళ్ల దందా కొనసాగిస్తున్నట్లు సమాచారం. ఏదేని వాహనం సరిహద్దు నుంచి లోపలికి రావాలన్నా, సరిహద్దు దాటి బయటికి వెళ్లాలన్నా అధికారులకు ముడుపులు ఇవ్వాల్సిందేనన్న చర్చ జోరుగా సాగుతోంది. టాక్సీ ప్లేట్, హెవీ లోడ్‌తో వాహనాలు వస్తున్నాయంటే సదరు అధికారులకు పండుగే. అధిక లోడ్‌తో వచ్చే, నిబంధనలకు విరుద్ధంగా నడిచే వాహనాలను అధికారులు నిలిపి తనిఖీ పేరుతో పక్కన ఉండమంటారు. ఆ తరువాత అక్కడే ఉండే ప్రైవేట్ వ్యక్తులు సదరు వాహనం వద్దకు వచ్చి బేరం మాట్లాడి సయోధ్య కుదిర్చినట్లుగా వ్యవహరిస్తారు. ఇలా నిత్యం ఒక్కో చెక్‌పోస్టు నుంచి రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు చేతులు మారుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి.

హెవీ లోడ్‌తో వచ్చిపోతున్న వాహనాలు..

ముడుపుల బాగోతం కారణంగా చెక్‌పోస్టు వద్ద అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటం వల్ల పీడీఎస్ బియ్యం, గంజాయి వంటి మాదకద్రవ్యాల రవాణా, హెవీ లోడ్ వాహనాల రాకపోకలు నిత్యకృత్యమయ్యాయి. ఆరు టైర్లు, పది టైర్లు, 14, 16 టైర్ల వాహనాలు నిబంధనల ప్రకారం 10 నుంచి 35 టన్నుల వరకు సరుకులను రవాణా చేయవచ్చు. కానీ, అందుకు భిన్నంగా లారీల్లో 5 నుంచి 20 టన్నుల అదనపు లోడ్‌తో వాహనాలు వెళ్తూ.. వస్తున్నాయి. అలాగే పర్మిట్, ఫిట్‌నెస్ లేని వాహనాలు నిత్యం వచ్చి పోతున్నాయి. అధికారులు మాత్రం కొన్ని వాహనాలకు జరిమానాలు విధించకుండా ముడుపులు తీసుకొని పంపిస్తుండగా, మరికొన్ని వాహనాలకు తక్కువ జరిమానా విధించి కొంత మొత్తాన్ని వారు జేబులో వేసుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇలాంటి ముడుపుల బాగోతంలో గంజాయి వంటి మత్తు పదార్థాలు సరిహద్దులు దాటి జిల్లాలోకి ప్రవేశిస్తోందన్న విమర్శలు ఉన్నాయి.

ముడుపులిచ్చి.. ధాన్యం రవాణా

తెలంగాణలో సన్న ధాన్యానికి రూ.500 బోనస్, రూ.2320 మద్దతు ధర ఉండటంతో వ్యాపారాలు ఆంధ్రా నుంచి లారీల్లో ధాన్యాన్ని అర్ధరాత్రి వేళల్లో చెక్‌పోస్టుల వద్ద సిబ్బందికి ముడుపులను ముట్టజెప్పి నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లోని మిల్లుల్లో నిల్వ చేసుకొని ఇక్కడి రైతుల పేరుతో అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారన్న ఆరోపణలు సైతం ఉన్నాయి.



వాడపల్లి చెక్‌పోస్టు

సిమెంటు లారీల నుంచి భారీగా వసూళ్లు

విజయవాడ – హైదరాబాద్ రహదారిలో కోదాడ మండలం నల్లబండగూడెం వద్ద, నార్కట్‌పల్లి – అద్దంకి హైవేలో వాడపల్లి వద్ద ఏర్పాటు చేసిన అంతరాష్ట్ర రవాణా చెక్‌పోస్టుల్లో వసూళ్ల దందా పెద్ద ఎత్తున సాగుతోందన్న ఆరోపణలు ఉన్నాయి. కోదాడకు సమీపంలో 20కి పైగా, అటు వాడపల్లి సమీపంలోనూ సిమెంట్ ఫ్యాక్టరీలు ఉండడంతో వాటి నుంచి ఓవర్‌లోడ్‌తో వెళ్లే లారీల నుంచి భారీగా వసూళ్లకు పాల్పడుతున్నట్లు తెలిసింది. కోదాడ, నల్లగొండ, మిర్యాలగూడ, హుజూర్‌నగర్‌లో ఉన్న ట్రాన్స్‌ఫోర్టు నిర్వాహకుల నుంచి నెలవారీ వసూళ్లు వాటికి అదనం. ఏదైనా లారీకి అన్ని పత్రాలు సక్రమంగా ఉన్నా ఏదో సాకులు చెప్పి రూ.200 నుంచి రూ.500 వసులు చేస్తారన్న ఆరోపణలు ఉన్నాయి. వరి కోతల సీజన్‌లో వచ్చిపోయే వరికోత యంత్రాలను కూడా వదలకుండా వసూళ్ల దందా కొనసాగిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

ప్రశాంతంగా ముగిసిన గ్రూప్–2 పరీక్ష

సూర్యాపేటటౌన్ : జిల్లాలో గ్రూప్–2 పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. రెండు రోజులపాటు గ్రూప్–2 పరీక్షలు నిర్వహించారు. జిల్లాలో మొత్తం 49 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. అందులో సూర్యాపేట జిల్లా కేంద్రంలో 30, కోదాడలో 19 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సాయి గౌతమి జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన సెంటర్‌ను కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 49 పరీక్ష కేంద్రాల్లో మొత్తం 16,857 మంది అభ్యర్థులకుగాను సోమవారం ఉదయం జరిగిన పరీక్షకు 8479 మంది హాజరుకాగా.. (50.29%), 8378 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారని తెలిపారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షకు మొత్తం అభ్యర్థులు 16857 గాను 8470 మంది అభ్యర్థులు హాజరయ్యారని (50.24%), 8387 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. పరీక్ష నిర్వహణలో పాల్గొన్న అధికారులకు, ఉద్యోగులకు, సిబ్బందికి, పరీక్షలు సజావుగా సాగేందుకు సహకరించిన పోలీసు సిబ్బందికి కలెక్టర్ అభినందనలు తెలియజేశారు. అలాగే జిల్లా కేంద్రంలోని పలు పరీక్ష కేంద్రాలను ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ పరిశీలించారు.



పరీక్ష రాయడానికి వచ్చిన దివ్యాంగుడిని తనిఖీ చేస్తున్న అధికారి



ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల సెంటర్‌లో బందోబస్తు వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

పాలెఅన్నారం పీఏసీఎస్‌లో విచారణ

చిలుకూరు: మండలంలోని నారాయణపురం (పాలెఅన్నారం) ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ కొండా సైదులు.. సంఘంలో అవినీతికి పాల్పడుతున్నాడని గ్రామానికి చెందిన దేశబోయిన నరసింహారావుతోపాటు పలువురు రైతులు ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో జిల్లా సహకార బ్యాంక్ అధికారి ఆదేశాల మేరకు సోమవారం జిల్లా అసిస్టెంట్ రిజిస్ట్రార్ రాంబాయమ్మ సంఘంలో విచారణ చేసేందుకు వచ్చారు. ముందుగా సంఘం చైర్మన్ కొండా సైదులు, సీఈఓ పూర్ణతో మాట్లాడి రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం విచారణ నిమిత్తం ఫిర్యాదుదారులను సంఘం కార్యాలయానికి పిలిపించారు. దీంతో దేశబోయిన నరసింహారావు, సంఘం మాజీ చైర్మన్ పల్లా రామిరెడ్డి, రైతు బూర వెంకటేశ్వర్లు సంఘం కార్యాలయానికి వెళ్లారు. ఈ క్రమంలో సంఘం బయట ప్రస్తుత చైర్మన్ కొండా సైదులు, మాజీ చైర్మన్ పల్లా రామిరెడ్డి మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. పల్లా రామిరెడ్డిపై చైర్మన్ బంధువులు చేయిచేసుకున్నారు. అక్కడ ఉన్నవారు జోక్యం చేసుకుని ఇరువర్గాల వారికి సర్దిచెప్పడంతో గొడవ సద్దుమణిగింది. ఈ విషయంపై రామిరెడ్డి చిలుకూరు పోలీస్‌స్టేషన్‌లో, కోదాడ డీఎస్పీకు ఫిర్యాదు చేశారు. సంఘం చైర్మన్ కొండా సైదులు సంఘం డబ్బులు దుర్వినియోగం చేస్తున్నాడని, డబ్బులు తీసుకుని సిబ్బందిని నియమిస్తున్నాడని మాజీ చైర్మన్ పల్లా రామిరెడ్డి, నరసింహారావు తోపాటు పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. ప్రశ్నించిన వారిపై భౌతిక దాడులకు కూడా పాల్పడుతున్నాడని తెలిపారు. ఈ విషయమై చైర్మన్ కొండా సైదులును ప్రశ్నించగా తన పేరుతో ఎలాంటి ధాన్యం రుణాలు తీసుకోలేదన్నారు. సొసైటీకి విచారణకు వచ్చిన అధికారి రాంబాయమ్మను వివరణ కోరగా.. చైర్మన్‌పై వచ్చిన ఆరోపణలపై విచారణ చేస్తున్నామని, సంఘంలో రికార్డులు తనిఖీ చేస్తున్నామని తెలిపారు. నివేదికను డీసీఓకు ఇవ్వనున్నట్లుగా తెలిపారు.

చెకుముకి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

సూర్యాపేటటౌన్ : రాష్ట్ర స్థాయి చెకుముకి సైన్స్ పోటీల్లో జిల్లాకు చెందిన మూడు విద్యార్థి బృందాలు వివిధ విభాగాల్లో ద్వితీయ స్థానాలను కైవసం చేసుకున్నారని జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు గొళ్లమూడి రమేష్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు రోజులుగా ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని సాంకేతిక కళాశాల వేదికగా పోటీలను మొత్తం ఐదు దశల్లో నిర్వహించారు. రాత పరీక్ష, ప్రయోగాల నిర్వహణ, క్విజ్, విజువల్ రౌండ్స్‌లలో రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల విద్యార్థులతో పోటీపడి జిల్లాకు చెందిన మూడు టీమ్‌లు రాష్ట్రస్థాయిలో రెండో స్థానం సాధించినట్లు పేర్కొన్నారు. విజేతలకు ఆదిలాబాద్ కలెక్టర్ బహుమతులు అందజేశారని తెలిపారు.



బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణానికి స్థలాల పరిశీలన

చిలుకూరు, గరిడేపల్లి : చిలుకూరు గుట్టల్లో, గరిడేపల్లి మండలంలోని గడ్డిపల్లి గ్రామంలో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల స్థలాన్ని సోమవారం బెంగళూరుకు చెందిన ఆర్కిటెక్ ఇంజనీర్ మనోజ్, పరిశీలించారు. ఈ సందర్భంగా మనోజ్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అన్ని హంగులతో నూతన టెక్నాలజీకి అనుగుణంగా స్కూల్ భవనాలు నిర్మించేలా ప్లాన్ సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. స్థలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అందుకు అనుగుణంగా భవన నిర్మాణ ప్లాన్ తయారు చేసేందుకు వచ్చినట్లు పేర్కొన్నారు. వారివెంట కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ, మంత్రి ఉత్తమ్ పీఏ కోట రామిరెడ్డి, స్కూల్ ఎడ్యుకేషన్ డీఈ రమేష్, తహసీల్దార్ ధృవకుమార్, సర్వేయర్ భాస్కర్, ఆర్ఐలు సీతయ్య, శ్వేత ఉన్నారు.


ఎడమకాల్వకు ఆన్ఆఫ్ పద్ధతిలో నీటి విడుదల

- షెడ్యూల్ విడుదల చేసిన అధికారులు
- ఏప్రిల్ 23 వరకు ఏడు దఫాలుగా..

నాగార్జునసాగర్ : సాగర్ ఎడమకాల్వ పరిధిలోని ఆయకట్టుకు యాసంగి సీజన్‌లో ఆన్ఆఫ్(ఆరుతడి) పద్ధతిలో నీటిని విడుదల చేస్తున్నట్లుగా ఎన్ఎస్పీ అధికారులు తెలిపారు. ఈ మేరకు సోమవారం సాగర్‌డ్యాం సర్కిల్ కార్యాలయం నుంచి షెడ్యూల్ విడుదల చేశారు. ఆరుతడి పంటలు వేసుకుని నీటిని పొదుపుగా వాడుకోవాలని, ఆయకట్టు చివరి భూములకు నీరందేలా రైతులు సహకరించాలని కోరారు. 15 డిసెంబర్ నుంచి 23 ఏప్రిల్ 2025 వరకు ఏడు దఫాలుగా 81రోజుల పాటు నీటిని విడుదల చేయనున్నారు. మొదటి దఫాలో మినహాయిస్తే మిగిలిన ఆరుదఫాల్లో 9 రోజుల పాటు నీటిని విడుదల చేస్తూ ఆరు రోజులపాటు నీటిని నిలిపివేయనున్నారు.

నీటి విడుదల షెడ్యుల్ ఇలా..

విడత	నుంచి	వరకు
మొదటి	15 డిసెంబర్	11జనవరి2025
రెండవ	19 జనవరి	28 జనవరి
మూడవ	5 ఫిబ్రవరి	14 ఫిబ్రవరి
నాల్గవ	22 ఫిబ్రవరి	3 మార్చి
ఐదవ	11 మార్చి	20మార్చి
ఆరవ	28 మార్చి	6 ఏప్రిల్
ఏడవ	14 ఏప్రిల్	23 ఏప్రిల్



దరఖాస్తులను సత్వరం పరిష్కరించండి

- కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

భానుపురి (సూర్యాపేట) : సీఎం ప్రజావాణితోపాటు ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి.రాంబాబుతో కలిసి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో మొత్తం 79 ఫిర్యాదులు అందాయని, అత్యధికంగా భూములకు సంబంధించి 22 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఫిర్యాదుదారుడి దరఖాస్తు పరిష్కరించలేకపోతే కారణాలను రాతపూర్వకంగా అందజేయాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వే సకాలంలో పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ వీవీ అప్పారావు, జిల్లా అధికారులు సతీష్ కుమార్, ఎల్.కిషన్, కోటాచలం, అశోక్, శంకర్, నరసింహారావు, భాస్కర్‌రెడ్డి, జగదీష్ రెడ్డి, శ్రీనివాస్‌నాయక్, లత, అనసూయ, బాపూజీ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్

'స్థానిక' పోరుకు సన్నద్ధం..!

- పంచాయతీ ఎన్నికలకు ఏర్పాట్లు
- 80 శాతం క్షేత్రస్థాయి పనులు పూర్తిచేసిన అధికార యంత్రాంగం
- ఏపీ నుంచి బ్యాలెట్ బాక్స్‌ల సేకరణ
- నేడు పోలింగ్ బూత్‌ల గుర్తింపు



జిల్లాలో మొత్తం గ్రామపంచాయతీలు : 486	
గతంలో ఉన్న గ్రామపంచాయతీలు : 475	
కొత్తగా ప్రకటించిన గ్రామ పంచాయతీలు: 11	ఎంపీపీ స్థానాలు 23
జెడ్పీటీసీ స్థానాలు 23	ఎంపీటీసీలు 213
పంచాయతీ ఓటర్లు : 6,82,882 మంది	

భానుపురి (సూర్యాపేట) : స్థానిక సంస్థల ఎన్నికలకు జిల్లా యంత్రాంగం సన్నద్ధం అవుతోంది. పంచాయతీ ఎన్నికలు బ్యాలెట్ విధానంలో జరగనున్నాయి. ఈ మేరకు అధికారులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ఎన్నికల సంఘం సూచనల మేరకు బ్యాలెట్ బ్యాక్స్‌ల సేకరణ జరిగింది. ఈ ఎన్నికలకు సంబంధించి దాదాపు 80 శాతం మేరకు క్షేత్రస్థాయిలో పనులు పూర్తయ్యాయి. తుది ఓటరు జాబితా, ఎన్నికల నిర్వహణకు ఎంతమంది సిబ్బంది కావాల్సి ఉందో గుర్తించారు. ఇక మంగళవారం జిల్లాలో పోలింగ్ బూత్‌ల తుది గుర్తింపు ప్రక్రియ పూర్తి కానుంది. ఇక ఎన్నికల సంఘం నోటిఫికేషన్ ఇచ్చిన వెంటనే ఎన్నికల ప్రక్రియ నిర్వహించేలా అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. జిల్లాలో 475 గ్రామపంచాయతీలు ఉండగా.. కొత్తగా 11 గ్రామ పంచాయతీలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీంతో మొత్తం గ్రామపంచాయతీల సంఖ్య 486 కు చేరుకుంది.

మూడు విడతలుగా ఎన్నికలు..

జిల్లాలో మూడు విడతలుగా పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. ఒక్కో విడతకు 1200 బ్యాలెట్ బ్యాక్స్‌లు అవసరం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ మేరకు జిల్లాలో బ్యాలెట్ బ్యాక్స్‌లు సరిపడా లేకపోవడంతో ఎన్నికల సంఘం సూచనల మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి దాదాపు 1500 బ్యాలెట్ బ్యాక్స్‌లను జిల్లాకు తీసుకొచ్చారు. ఇక ఎన్నికల్లో కీలకమైన ఓటరు జాబితాను అధికారులు సిద్ధం చేశారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో విడుదల చేసిన జాబితాకు తోడుగా కొత్త ఓటర్లను జోడించి నూతన జాబితా రూపొందించారు. ఎన్నికల నిర్వహణ కోసం వివిధ స్థాయిల్లో దాదాపు 6200 మంది సిబ్బంది అవసరం ఉన్నట్లు గుర్తించారు. అదేవిధంగా జిల్లాలో వార్డుల వారీగా పోలింగ్ బూత్‌ల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటికే పోలింగ్ బూత్‌ల గుర్తింపుపై రాజకీయ పార్టీలతో జిల్లా స్థాయి, మండల స్థాయి సమావేశాలను అధికారులు పూర్తి చేశారు. మంగళవారం తుది పోలింగ్ బూత్‌ల జాబితాను విడుదల చేయనున్నారు.

సమగ్ర సర్వే ఆధారంగానే..?

గ్రామపంచాయతీ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల రిజర్వేషన్లపై అధికార యంత్రాంగంతోపాటు రాజకీయ పార్టీలు, ఆసక్తి గల అభ్యర్థుల్లో చర్చ మొదలైంది. 2018లో రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించిన విధంగానే రిజర్వేషన్లు ఉంటాయా.. లేదంటే ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుల సర్వే ఆధారంగా రిజర్వేషన్లను మారుస్తారా అనేది తేలాల్సి ఉంది. అయితే ఈ విషయంలో ఇప్పటి వరకు ఎలాంటి స్పష్టత లేకపోయినా సమగ్ర సర్వే ఆధారంగానే రిజర్వేషన్లు ఉండే అవకాశమున్నట్లు తెలుస్తోంది. ఇదే జరిగితే జిల్లాలో పంచాయతీల వారీగా రిజర్వేషన్లను ప్రకటించాల్సి ఉంటుంది.

క్షేత్రస్థాయిలో పనులు చేస్తున్నాం

జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికలకు కావాల్సిన పనులను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఒక్కొక్కటిగా పూర్తి చేస్తున్నాం. ఇప్పటికే ఓటరు జాబితా పూర్తయింది. ఎన్నికల సిబ్బంది లెక్క తేల్చాం. పోలింగ్ బూత్ గుర్తింపు కోసం ఇప్పటికే రాజకీయ పార్టీలతో సమావేశాలు ఏర్పాటు చేశాం. తుది పోలింగ్ బూత్‌ల గుర్తింపును ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం ప్రకటించనున్నాం.

– నారాయణరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి

క్లుప్తంగా

వరకట్న వేధింపుల కేసులో ఇద్దరికి జైలుశిక్ష

రామగిరి(నల్లగొండ), నకిరేకల్: వరకట్న వేధింపుల కేసులో ఇద్దరికి జైలుశిక్ష విధిస్తూ నల్లగొండ ఫ్యామిలీ కోర్టు మూడవ అదనపు జడ్జి డి. దుర్గాప్రసాద్ సోమవారం తీర్పు వెలువరించారు. నకిరేకల్ పట్టణానికి చెందిన భవానీకి మర్రిగూడ మండల కేంద్రానికి చెందిన ఏలే హరీష్‌తో 2017లో వివాహం జరిగింది. హరీష్ ఆర్‌డబ్ల్యూఎస్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. అదనపు కట్నం తీసుకురావాలని భర్త హరీష్, అత్త ముత్యాలమ్మ భవానీని వేధింపులకు గురిచేస్తుండడంతో 2020 మే నెలలో ఆమె నకిరేకల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు అప్పటి సీఐ బాలగోపాల్ కేసు నమోదు చేసి నిందితులను కోర్టులో హాజరుపర్చారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి. జవహర్‌లాల్ వాదనలతో ఏకీభవించిన ఫ్యామిలీ కోర్టు మూడవ అదనపు జడ్జి డి. దుర్గాప్రసాద్ ఏలే హరీష్‌కు 2 సంవత్సరాల 8 నెలల జైలు శిక్ష రూ. 6 వేలు జరిమానా, ముత్యాలమ్మకు ఒక సంవత్సరం జైలు శిక్ష రూ. 5వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. ఈ కేసులో సరైన ఆధారాలు సేకరించి నిందితులకు శిక్ష పడేలా సహకరించిన అప్పటి నకిరేకల్ సీఐ బాలగోపాల్, ప్రస్తుత నకిరేకల్ సీఐ రాజశేఖర్, కోర్టు కానిస్టేబుళ్లు నరేందర్, మల్లికార్జునను నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్రపవార్ అభినందించారు.

అదృశ్యమైన వ్యక్తి అస్థిపంజరం లభ్యం

- పది నెలల తర్వాత గుర్తింపు

సూర్యాపేట టౌన్: అదృశ్యమైన వ్యక్తి పది నెలల తర్వాత అస్థిపంజరంగా కనిపించాడు. ఈ ఘటన సోమవారం సూర్యాపేట మండల పరిధిలోని కేటీ అన్నారం గ్రామ పంచాయతీలో జరిగింది. మృతుడి కుటుంబ సభ్యులు, సూర్యాపేట రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కేటీ అన్నారం గ్రామానికి చెందిన గంధం నాగయ్య(46) ఈ ఏడాది మార్చి 1వ తేదీన ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. నాగయ్య కోసం కుటుంబ సభ్యులు ఎంత వెతికినా అతడి ఆచూకీ లభించకపోవడంతో మార్చి 7వ తేదీన అతడి భార్య సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. కాగా సోమవారం కేటీ అన్నారం గ్రామ శివారులో ఓ వ్యక్తి ఈత చెట్ల నుంచి కల్లు గీసేందుకు చెట్లను తొలగిస్తుండగా గుర్తుతెలియని అస్థిపంజరం కనిపించింది. వెంటనే అతడు గ్రామస్తులు, పోలీసులకు సమాచారం ఇచ్చాడు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అస్థిపంజరం నాగయ్యది అయ్యి ఉండవచ్చనే అనుమానంతో అతడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. నాగయ్య కుటుంబ సభ్యులు అస్థిపంజరం మీద ఉన్న బట్టలు, చెప్పుల ఆధారంగా ఆ అస్థిపంజరం నాగయ్యదే అని కుటుంబ సభ్యులు నిర్ధారించుకున్నారు. పోలీసులు మాత్రం పోస్టుమార్టం అనంతరం తుది నిర్ధారణకు వస్తామని తెలిపారు. కాగా నాగయ్య ఆత్మహత్య చేసుకుని ఉంటాడని గ్రామస్తులు, కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. నాగయ్య భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు రూరల్ ఎస్ఐ బాలునాయక్ తెలిపారు.

మహిళ మెడలో పుస్తెలతాడు అపహరణ

పెన్‌పహాడ్: మహిళ మెడలోని పుస్తెలతాడును గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఈ ఘటన పెన్‌పహాడ్ మండల పరిధిలోని లింగాల గ్రామంలో సోమవారం జరిగింది. హెడ్ కానిస్టేబుల్ యాదగిరి తెలిపిన వివరాల ప్రకారం.. లింగాల గ్రామానికి చెందిన దూదిపాల రమణమ్మ గ్రామ శివారులోని తాటికొండ కృష్ణారెడ్డి పొలం వద్ద పశువులు మేపుతుండగా గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి ఆమె మెడలోని రెండున్నర తులాల బంగారు పుస్తెలతాడు లాక్కొని పారిపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

'రీజినల్' భూ నిర్వాసితుల ధర్నా

- చౌటుప్పల్ ఆర్డీఓ కార్యాలయం ఎదుట కూర్చొని భోజనాలు
- న్యాయం చేయకుంటే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరిక



చౌటుప్పల్ ఆర్డీఓ కార్యాలయం ఎదుట బైఠాయించిన భూ నిర్వాసితులు



కార్యాలయం ప్రధాన ద్వారం ముందు కూర్చొని భోజనం చేస్తున్న భూ నిర్వాసితులు

చౌటుప్పల్: రీజినల్ రింగ్‌రోడ్డు బాధితులు సోమవారం చౌటుప్పల్ ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రాణాలైనా అర్పిస్తాం తప్ప రీజినల్ రింగ్‌రోడ్డుకు తమ భూములు ఇవ్వబోమని, భూములు తీసుకుంటే మరో ప్రాంతంలో భూమి ఇవ్వాలని లేదా బహిరంగ మార్కెట్‌లో ఉన్న ధర ప్రకారంగా పరిహారం చెల్లించాలని ప్లకార్డులు ప్రదర్శించారు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు అవలంబిస్తున్న తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. భూ నిర్వాసితులతో ప్రత్యేకంగా కలెక్టర్ సమక్షంలో సమావేశం ఏర్పాటు చేయించి సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తానని గతంలో ఆర్డీఓ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఆర్డీఓ స్వయంగా వచ్చి సమాధానం చెప్పాలని అక్కడే కూర్చున్నారు. భోజనం విరామం అయినా ఆర్డీఓ కార్యాలయానికి చేరుకోకపోవడంతో నిర్వాసితులు అక్కడికే భోజనాలు తెప్పించుకుని కార్యాలయ ప్రధాన ద్వారం వద్ద భోజనాలు చేశారు. అప్పుడే ఆర్డీఓ శేఖర్‌రెడ్డి కార్యాలయానికి చేరుకున్నారు. కొంతసేపటి తర్వాత ఆర్డీఓతో భూ నిర్వాసితులు వాగ్వాదానికి దిగారు. విలువైన భూములకు నామమాత్రపు ధరలు ఎలా నిర్ణయిస్తారని ప్రశ్నించారు. ఇష్టానుసారంగా ధరలు నిర్ణయించడం సరికాదన్నారు. కలెక్టర్‌తో సమావేశం ఏర్పాటు చేయించి న్యాయం జరిగేలా చూస్తానని ఇచ్చిన హామీని ఎందుకు విస్మరిస్తున్నారని నిలదీశారు. శాంతియుతంగా ఆందోళన చేస్తున్నా స్పందించకుంటే లగచర్ల మాదిరిగా ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వారం రోజుల్లో కలెక్టర్‌తో సమావేశం ఏర్పాటు చేయిస్తానని ఆర్డీఓ హామీ ఇవ్వడంతో నిర్వాసితులు శాంతించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. నిబంధనల ప్రకారం ఔటర్ రింగ్‌రోడ్డు నుంచి 40కిలోమీటర్ల వద్దకు అలైన్‌మెంట్‌ను మార్చాలని డిమాండ్ చేశారు. న్యాయం జరిగే వరకు పోరాడుతామని తెలిపారు. కార్యక్రమంలో భూ నిర్వాసితులు గుజ్జుల సురేందర్ రెడ్డి, మారుపాక రామలింగం, సందగళ్ల మల్లేష్‌గౌడ్, బోరెం ప్రకాష్‌రెడ్డి, జాల వెంకటేష్, దబ్బటి రాములు, జాల శ్రీశైలం, పంకెర్ల యాదయ్య, సుర్కంటి రాజిరెడ్డి, జాల నర్సింహ, మైసయ్య, దశరథ, రమేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దేవరకొండ ఖిలాను పర్యాటక కేంద్రంగా చేయాలి

- అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే బాలునాయక్



అసెంబ్లీలో మాట్లాడుతున్న బాలునాయక్

దేవరకొండ: ఎంతో చరిత్ర కలిగిన దేవరకొండ ఖిలాను ప్రభుత్వం పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ ప్రభుత్వాన్ని కోరారు. శాసనసభ సమావేశాల్లో భాగంగా సోమవారం క్వశ్చన్ అవర్‌లో ఆయన ఈ మేరకు ప్రస్తావించారు. దేవరకొండ ఖిలాను పర్యాటక కేంద్రంగా గుర్తించి దాని అభివృద్ధికి ప్రభుత్వం అవసరమైన నిధులను కేటాయించాలని కోరారు. అంతేగాకుండా దేవరకొండ నియోజకవర్గ పరిధిలోని అనేక ప్రాంతాలు పర్యాటక కేంద్రాలుగా ఏర్పాటు చేసేందుకు అనువుగా ఉన్నాయన్నారు. ఉమ్మడి చందంపేట మండలంలోని గాజుబిడం గుహలు, వైజాగ్ కాలనీ, దేవరచర్ల శివాలయం, ఏలేశ్వరం మల్లయ్య గట్టు వంటి ప్రాంతాల అభివృద్ధి చేయాలని ఆయన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. త్వరలో ప్రభుత్వం పర్యాటక పాలసీని తీసుకురానున్నట్లు ఆయన తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

మేళ్లచెరువు: అక్రమంగా డీసీఎంలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ పరమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మేళ్లచెరువు మండలం రేవూరు గ్రామం నుంచి సోమవారం తెల్లవారుజామున ఏడుగురు వ్యక్తులు 25 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని డీసీఎంలో ఆంధ్రప్రదేశ్‌కు తరలిస్తుండగా.. పక్కా సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి డీసీఎంను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బెజవాడ లక్ష్మీనారాయణ, రెమిడాల సాయిమాధవ్, సుల్తాని బాలు, చర్లపల్లి నవీన్, అచ్చారావు పద్మ, సాధుపాటి పద్మ, దాసరి సుగుణపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అదానీతో జరిగిన ఒప్పందాలను తెలియజేయాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

చౌటుప్పల్: రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించి సోలార్ ప్రాజెక్టు కోసం అదానీతో జరిగిన ఒప్పందాల సారాంశం ఏమిటో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలకు తెలియజేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. దేశ సంపదను దోచుకుంటూ.. రాష్ట్రాలకు లంచాలు ఇచ్చుకుంటూ కాంట్రాక్టులు పొందుతున్న అంశం బహిర్గతమైనందున తక్షణమే విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తమ్మినేని మాట్లాడారు. లంచానికి సంబంధించి అమెరికాలో కేసు నమోదు కాగానే రాష్ట్రానికి అదానీ ఇచ్చిన రూ.100 కోట్ల విరాళాన్ని సీఎం తిరిగి ఇస్తున్నట్లుగా లేఖ రాయడాన్ని స్వాగతిస్తున్నామని, అయినా దావోస్‌లో జరిగిన సంయుక్త సమావేశంలో రూ.12,400 కోట్ల ఒప్పందాల అంశం ఏమిటన్నది ఇంకా తేలాల్సి ఉందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకున్నా పండుగలు చేసుకుంటున్నారని విమర్శించారు. ఎన్ని అమలు చేశారో కాంగ్రెస్ నాయకులు ఆత్మవిమర్శ చేసుకోవాలని సూచించారు. కాంగ్రెస్ నాయకులు చెప్పిన హామీల విలువ ఐదేళ్లలో ఎంత, ఇప్పటి వరకు ఏడాదిలో చేసిందేమిటో చెప్పాలన్నారు. హామీల అమలు ఎక్కడా జరగలేదన్నారు. ఏడో హామీగా ఇచ్చిన ప్రజాస్వామ్య పరిరక్షణ అంశం ఎక్కడ కూడా అమలు జరగడం లేదన్నారు. మూసీ ప్రక్షాళన, హైడ్రా, రామగుండం ఫ్యాక్టరీ, లగచర్ల, గ్రూప్-1 పరీక్షలు వంటి అంశాలపై ఎవరితోనూ సంప్రదించలేదని అన్నారు. ఎన్నికల హామీలను అమలు చేసి ఐదేళ్లు అధికారంలో ఉంటే తమకెలాంటి అభ్యంతరం లేదని, అలా కాకుండా హామీలను తుంగలో తొక్కితే మాత్రం ప్రజలతో కలిసి ప్రభుత్వంపై పోరాడుతామన్నారు. విలేకరుల సమావేశంలో సీపీఎం నాయకులు కల్లూరి మల్లేశం, కొండమడుగు నర్సింహ, భట్టుపల్లి అనురాధ, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ జెండా ట్రయల్ రన్ విజయవంతం

- నడిగూడెం రాజావారి కోటలో 110 అడుగుల ఎత్తులో ఏర్పాటు
- వచ్చే నెల రాష్ట్రపతి చేతులమీదుగా ప్రారంభం



110 అడుగుల ఎత్తులో జెండా



జెండా ట్రయల్ రన్‌ను ప్రారంభిస్తున్న సీనియర్ సిటిజన్ లక్ష్మీతులశమ్మ

నడిగూడెం: నడిగూడెం మండల కేంద్రంలోని రాజావారి కోటలో డెక్కన్ ఆర్కియాలజీ అండ్ కల్చరల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (డాక్రి) ఆధ్వర్యంలో 110 అడుగుల ఎత్తులో ఏర్పాటు చేయనున్న జాతీయ జెండా ట్రయల్ రన్ కార్యక్రమాన్ని సోమవారం విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్ లక్ష్మీతులశమ్మ చేతుల మీదుగా ట్రయల్ రన్‌ను ప్రారంభించారు. వచ్చే నెల మొదటి వారంలో రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము చేతులమీదుగా రాజావారి కోటలో ఈ జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. ఢిల్లీలో కల్షి ఇండస్ట్రీ రూపొందించిన ఈ జాతీయ జెండాను ప్రత్యేక లారీలో నడిగూడేనికి తీసుకొచ్చారు. ఈ జాతీయ పతాకం 35 అడుగుల ఎత్తు, 45 అడుగుల వెడల్పుతో రెండు తెలుగు రాష్ట్రాల్లోని ఎక్కువ ఎత్తులో ఉన్న జెండాగా ఉండటం విశేషం. నడిగూడెం రాజావారి కోటలో 1915లో అప్పటి రాజావారు జమీందారు రాజానాయిని బహద్దూర్ వెంకటరంగారావు వద్ద వ్యవసాయాధికారి పనిచేస్తున్న పింగళి వెంకయ్య త్రివర్ణ పతాకాన్ని రూపొందించారు. అందుకు గుర్తుగా ఇక్కడ 110 అడుగుల ఎత్తులో జాతీయ జెండాను ఏర్పాటు చేస్తున్నట్లు డాక్రి సంస్థ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్రి సంస్థ వ్యవస్థాపకుడు జితిన్‌బాబు, డైరెక్టర్ హిమబిందు, సామినేని రమేష్, కేఎస్ఎన్ ప్రసాద్, వంశీ, వీరారెడ్డి, స్థానికులు గజ్జి అప్పారావు, వందనపు మోహన్‌రావు, పందిరి శేఖర్‌రెడ్డి, సూర్యప్రకాశరావు, మొరిశెట్టి రమణ, భోనగిరి ఉపేందర్, ఎండీ జలీల్, దేరవంగుల వీరన్న, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నృసింహుడి నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో లక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని సోమవారం అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుప్రభాత సేవ, నిత్యహోమం, మూలవిరాట్‌కి పంచామృతాభిషేకం చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లను అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదం రక్తికట్టించారు. కల్యాణ తంతులో భాగంగా విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రుత్విగ్వరణం, రక్షాబంధనం, పంచగవ్యప్రాశన, మధుపర్కపూజ, మాంగల్యధారణ గావించారు. శివాలయంలో పార్వతీరామలింగేశ్వరస్వామికి ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్‌కుమార్ పాల్గొన్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

క్రెడిట్ కార్డు ఇప్పిస్తామని సైబర్ నేరగాళ్ల టోకరా

- వీడియో కాల్ చేసి ప్రభుత్వ ఉద్యోగి అకౌంట్ నుంచి నగదు బదిలీ చేసుకున్న నిందితులు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు



నగదు బదిలీ అయినట్లు వచ్చిన మెసేజ్‌ను చూపిస్తున్న బాధితుడు

ఆత్మకూరు(ఎం): క్రెడిట్ కార్డు ఇప్పిస్తామని ప్రభుత్వ ఉద్యోగికి సైబర్ నేరగాళ్లు టోకరా పెట్టారు. ఈ ఘటన ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. ఆత్మకూరు(ఎం) మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎ. సురేందర్‌రెడ్డి గత నెల 21వ తేదీన తన సెల్‌ఫోన్‌లో పంజాబ్ నేషనల్ బ్యాంక్ యాప్ ద్వారా క్రెడిట్ కార్డు కోసం దరఖాస్తు చేస్తున్నాడు. అదే సమయంలో 70471 82015 నంబర్ నుంచి అతడికి వీడియో కాల్ వచ్చింది. అవతలి వ్యక్తి తాను బ్యాంక్ అధికారి అని చెప్పి సురేందర్‌రెడ్డి మాట్లాడటం మొదలు పెట్టాడు. క్రెడిట్ కార్డు కోసం ఆధార్ కార్డు నంబర్‌ను యాప్‌లో నమోదు చేసి ఓకే చేయాలని సురేందర్‌రెడ్డితో చెప్పాడు. దీంతో సురేందర్‌రెడ్డి యాప్‌లో ఎంత ప్రయత్నించినా ఆధార్ నంబర్ సెండ్ కాలేదు. దీంతో అవతలి వ్యక్తి 'నీకు నమోదు చేయడం వస్తలేదు, నేను చేసి సెండ్ చేస్తాను.. నీవు వీడియో కాల్‌లో లైన్‌లో ఉండు' అంటూ సురేందర్‌రెడ్డి ఆధార్ కార్డు వివరాలను యాప్‌లో నమోదు చేశాడు. ఆ తర్వాత ఏదైనా క్రెడిట్ కార్డు చూపించమని సురేందర్‌రెడ్డితో అనడంతో అతడు తన వద్ద ఉన్న ఇండస్ ఇండ్ బ్యాంక్ క్రెడిట్ కార్డును వీడియో కాల్‌లో చూపించాడు. వెంటనే క్రెడిట్ కార్డు నుంచి రూ.20 వేలు బదిలీ అయినట్లు సురేందర్‌రెడ్డి మొబైల్‌కు మెసేజ్ రావడంతో వెంటనే అతడు వీడియో కాల్‌ను కట్ చేశాడు. తర్వాత వెంటవెంటనే మరో ఏడుసార్లు డబ్బులు బదిలీ అయినట్లు మెసేజ్‌లు రావడంతో సైబర్ క్రైం టోల్‌ఫ్రీ నంబర్ 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశాడు. అనంతరం ఆత్మకూరు(ఎం) పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా.. రూ.లక్ష దాటి సైబర్ క్రైం మోసం జరిగితే హైదరాబాద్‌లోని ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని పోలీసులు సూచించడంతో బాధితుడు ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లాడు. అక్కడ పోలీస్ సిబ్బంది రూ.1.50 లక్షలకు పైబడి సైబర్ క్రైం మోసం జరిగినట్లయితేనే తమ వద్ద ఫిర్యాదు చేయాలని, ఇంత దూరం రావాల్సిన అవసరం లేదని చెప్పడంతో తిరిగి ఆత్మకూరు(ఎం) పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ విషయమై స్థానిక ఎస్ఐ కృష్ణయ్యను వివరణ కోరగా.. బాధితుడు ఫిర్యాదు చేయడంలో ఆలస్యం చేశాడని, అయినప్పటికీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. సైబర్ నేరగాళ్లు ఏటీఎం ద్వారా డబ్బులు విత్ డ్రా చేసినట్లుగా తెలిసిందని, బాధితుడికి న్యాయం చేస్తామని చెప్పారు.

యజ్ఞం నిర్వహణకు అనుమతి ఇవ్వాలని రాస్తారోకో

- ఏడు గంటల పాటు బైఠాయించిన అయ్యప్ప, హనుమాన్ మాలధారులు



రాస్తారోకో చేస్తున్న మాలధారులు, పాల్గొన్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి

నార్కట్‌పల్లి: మండల కేంద్రంలోని అంగడి స్థలంలో మంగళవారం హనుమాన్ యజ్ఞం నిర్వహించేందుకు అనుమతి ఇవ్వాలని అయ్యప్ప, హనుమాన్ మాలధారులు సోమవారం నార్కట్‌పల్లి బస్టాండ్ ఎదుట రాస్తారోకో చేశారు. యజ్ఞానికి పోలీసులు అనుమతి నిరాకరించడాన్ని నిరసిస్తూ ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఆందోళన కొనసాగించారు. రోడ్డుపై (భిక్ష) భోజనం చేసి నిరసన తెలిపారు. వారికి బీజేపీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి పజ్జూరి వెంకట్‌రెడ్డి మద్దతు ప్రకటించి మాట్లాడారు. అంగడి స్థలం గ్రామ కంఠం భూమిగా కోర్టు తీర్పు ఇచ్చినా పోలీసులు ఓ వర్గం వారికి మద్దతుగా ఉండటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అంగడి స్థలంలో అనుమతులు లేని మూసివేయించే వరకు ఎలాంటి కార్యక్రమాల నిర్వహణకు అనుమతులు ఇవ్వలేమని, సమస్యను పరిష్కరిస్తామని సీఐ నాగరాజు, ఎంపీడీఓ ఉమేష్ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. పట్టణంలోని వ్యాపారులు దుకాణాలు మూసి మాలధారులకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో హనుమాన్, అయ్యప్ప మాలధారులు కొరివి శంకర్, భాస్కర్‌రావు,గణేష్, మేడబోయిన శ్రీను, రామలింగయ్య, భాస్కర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

చర్యలు తీసుకోవాలని వినతి

నార్కట్‌పల్లి మండలంలోని ఓ ప్రార్థనా మందిరం వద్ద మత ఘర్షణలు జరిగినట్లు ఎక్స్(ట్విటర్)లో పోస్ట్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని మాలధారులు సీఐ నాగరాజు, ఎస్ఐ క్రాంతికుమార్‌కు వినతిపత్రం అందజేశారు.



రోడ్డుపై భోజనం చేస్తూ నిరసన తెలుపుతున్న అయ్యప్ప, హనుమాన్ మాలధారులు

టీవీఎస్ మోపెడ్‌ను ఢీకొట్టిన బొలేరో వాహనం

- ఒకరు మృతి.. మరొకరికి గాయాలు



గోపయ్య (ఫైల్)

పెద్దవూర: బొలేరో వాహనం టీవీఎస్ మోపెడ్‌ను ఢీకొట్టడంతో ఒకరు మృతిచెందగా.. మరొకరికి గాయాలయ్యాయి. ఎస్ఐ వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దవూర మండలం పోతునూరు గ్రామ పంచాయతీ పరిధిలోని ఏనెమీదిగూడెం గ్రామానికి చెందిన ఎరుకల గోపయ్య(55), కొమ్ముగోని మల్లయ్య(50) సోమవారం టీవీఎస్ మోపెడ్‌పై పెద్దవూరకు వస్తున్నారు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో పెద్దవూర నుంచి కొండమల్లేపల్లి వైపు వెళ్తున్న బొలేరో వాహనం పెద్దవూర మండల కేంద్రంలోని వ్యవసాయ ఉప మార్కెట్ సమీపంలో గల పెట్రోల్‌బంక్ ఎదుట టీవీఎస్ మోపెడ్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గోపయ్య, మల్లయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు. గోపయ్య నల్లగొండ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మల్లయ్య చికిత్స పొందుతున్నాడు. మృతుడికి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య పున్నమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

త్రుటిలో తప్పిన పెనుప్రమాదం

టీవీఎస్ మోపెడ్‌ను ఢీకొట్టిన బొలేరో వాహనం అదుపుతప్పి జడ్చర్ల-కోదాడ జాతీయ రహదారి పక్కన గల 33/11 కేవీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి బోల్తాపడింది. దీంతో స్తంభం సగానికి విరిగింది. స్తంభం కిందపడకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

మద్యం దుకాణంలో చోరీ

కొండమల్లేపల్లి: మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ వైన్స్‌లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. రోజుమాదిరిగానే ఆదివారం రాత్రి వైన్స్ నిర్వాహకుడు జంగారెడ్డి వైన్స్ మూసివేసి ఇంటికి వెళ్లాడు. సోమవారం ఉదయం వచ్చి చూసేసరికి వెనుక వైపు తలుపులు పగులగొట్టి ఉండటంతో పాటు రూ.10వేలు, సీసీ కెమెరాల హార్డ్‌డిస్క్‌లు చోరీకి గురైనట్లు గుర్తించాడు.ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని ఎస్ఐ రామ్మూర్తి తెలిపారు.

మిరప కోతలో మెళకువలు పాటించాలి



మిరపకాయలను గ్రేడింగ్ చేస్తున్న కూలీలు



మిరపకాయలు ఏరుతున్న కూలీలు

- పెద్దవూర మండల వ్యవసాయాధికారి సందీప్‌కుమార్ సూచన



పెద్దవూర: మిరప పంటను ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విస్తారంగా సాగు చేస్తున్నారు. మిరప పంట ఇప్పుడిప్పుడే పండుగా మారుతుండటంతో రైతులు మిరపకాయలను కోసేందుకు సిద్ధమవుతున్నారు. మిరప కోత, ఆరబెట్టే సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకోకుంటే రైతులు నష్టాన్ని చవిచూడాల్సి వస్తుందని పెద్దవూర మండల వ్యవసాయ అధికారి కె. సందీప్‌కుమార్ అన్నారు. మిరప కోత, ఆరబెట్టే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఆయన మాటల్లోనే..

మిరప రైతులు ఎకరానికి 20 నుంచి 30 క్వింటాళ్ల దిగుబడి సాధిస్తున్నా నాణ్యత లేకపోవడంతో నష్టాలను చవిచూడాల్సి వస్తుంది. సరైన సమయంలో కోతలు కోయక, కల్లాల్లో వర్షానికి, మంచుకు కాయలు తడిస్తే నాణ్యత తగ్గుతుంది. మార్కెట్లో ధరలు లేక ఎగుమతులకు పనికిరాక, వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేయడం వంటి కారణాలతో రైతులు నష్టపోతున్నారు. పంట మార్పిడి చేయకపోవడం, విచక్షణారహితంగా పురుగు మందులను పిచికారీ చేయడం, పండిన మిరపకాయలు ఎప్పటికప్పుడు తెంచకపోవడం వంటి కారణాలతో కాయ నాణ్యత లోపిస్తుంది.

ఆరబెట్టడం ఇలా..

కొన్నిసార్లు కోతల సమయంలో వర్షాలు కురిస్తే సకాలంలో కోతలు జరగక కోసిన వాటిని సరైన సమయంలో ఎండబెట్టకపోవడంతో నాణ్యత లేని మిర్చిగా మారిపోతుంది. ఫలితంగా మార్కెట్లో కాయలకు సరైన ధర రాక నష్టపోవాల్సి వస్తుంది. మిరప కాయల్ని ఎండబెట్టే కల్లాల్ని గట్టి భూమి ఉండే ప్రదేశంలో ఏర్పాటు చేసుకోవాలి. దుమ్ము ఎక్కువగా లేని, కొద్దిగా ఏటవాలుగా ఉండే ప్రదేశాన్ని ఎంచుకోవాలి. నీళ్లు వెళ్లే వైపు కల్లం పొడవుగా ఉండాలి. వర్షం పడినప్పుడు పైనీళ్లు కల్లం పైకి రాకుండా కల్లం చుట్టూ అడుగున్నర ఎత్తు కట్ట ఏర్పాటు చేసుకోవాలి. తోట విస్తీర్ణం, దిగుబడిని బట్టి కల్లం పొడవు, వెడల్పులను తయారు చేసుకోవాలి. వర్షాలు పడ్డప్పుడు పరదాలు కప్పుతాం కాబట్టి నీరు తీసివేయడానికి అనుకూలంగా ఉంటుంది. దాదాపు 10 క్వింటాళ్ల మిరపకు 30 అడుగుల వెడల్పు, 60 అడుగుల పొడవు గల కల్లం తయారు చేసుకోవాలి. కల్లం సైజును బట్టి టార్పాలిన్ కవరు తెచ్చుకోవాలి. ప్రతిరోజు కోసే కాయల్ని కుప్పలుగా పోసి మరుసటి రోజు ఉదయం మంచు తగ్గగానే పలుచగా పోసి ఆరబెట్టాలి. ప్రతిరోజు సాయంత్రం ఆరబెట్టిన మిరప కాయల్ని కుప్పగా పోసి టార్పాలిన్ కవర్ కప్పి కాయలపై మంచు పడకుండా జాగ్రత్త తీసుకోవాలి. ఇలా చేస్తే గాలి, వెలుతురు బాగా ప్రసరించి కాయలు త్వరగా ఎండుతాయి. కాయలు బాగా ఎండకముందే తెల్లకాయలు వేరుచేయాలి. కాయల్లో 5 శాతం తేమ ఉన్నప్పుడే వాటిని మండె పోసి గోనె సంచులతో కప్పాలి. మార్కెట్‌కు తీసుకెళ్లే రోజు ఉదయం శుభ్రమైన ఖాళీ సంచుల్లో వాటిని నింపాలి. ఒక్కో సంచిలో 40 కిలోల కాయల కన్నా ఎక్కువ నింపకూడదు. ఎక్కువ కాయల్ని సంచిలో తొక్కితే కాయ నాణ్యత చెడిపోయి మార్కెట్‌లో సరైన ధర రాదు. కోత సమయంలో ఈ విధమైన చర్యలు చేపడితే నాణ్యమైన పంటతో పాటు మార్కెట్లో అధిక ధర పలుకుతుంది.

కోత విధానం

మిరపతోటలో కొన్ని కాయలు పండిన వెంటనే కూలీలతో కోస్తే చెట్టు విరిగిపోయి తోటకు నష్టం కలుగుతుందని రైతులు భావిస్తున్నారు. చాలా కాయలు పండిన తర్వాత ఒకేసారి కోయవచ్చునని మరికొంత మంది రైతులు భావించి కోతను ఆలస్యం చేస్తుంటారు. ఇలాంటి పరిస్థితుల్లో వర్షాలు కురిస్తే పండిన కాయలు రాలిపోతాయి. మంచు వల్ల కూడా కాయలు రాలిపోయే అవకాశం ఉంది. ఒక్కోసారి తెల్లకాయలు ఎక్కువగా వస్తుంటాయి. మొక్కల ఎదుగుదల తగ్గుతుంది. అందువల్ల రైతులు తోటలో కోతకు వచ్చిన కాయల్ని విడతల వారీగా కోసి నాణ్యత గల కాయల్ని మార్కెట్‌కు పంపాలి. పండిన కాయల్ని వెంటనే కోస్తే తెల్లకాయలు ఎక్కువగా రావు. కాయకోత తర్వాత ఎరువులు వేసి, నీటి తడి పెడితే అదనంగా మొక్కకు కాయ వచ్చి దిగుబడి పెరుగుతుంది. రైతులు కనీసం కాయలను ఆరు, ఏడు దఫాలుగా కోయాలి.